సుశీల మగనితో కొత్తగా కాపరానికి వచ్చి, తను మెసలబోయే యింటి బాల్కనీనించి ఒక్కసారి యెదురుగా కనిపిస్తున్న ప్రకృతివేపు చూసింది బైనాబీచ్ నాయంత్రం పడవలింకా సముద్రంలో కదలుతున్నాయి. పడమటి ఆకాశం యెరుపురంగును నారింజపండు రంగుగా మార్చుకుంటోంది. ఇద్దరూ చాలసేపు అలా మౌనంగా నిల్చొని చూస్తున్నారు. చీకటిపడ్డోంది.

"ఆ వృక్షపు ముక్కుపుడక ఆకాశంలోకి యెగిరిపోయింది — అదిగో" అన్నాడు శేష. సుశీల శుక్రగ్రహం దగ్గరలో ఉన్న బాలచంద్రుడ్ని చూస్తోంది. రానురాను అలలపై శుక్రుని వెలుగు పడ్తోంది.

# బైనా

## బలివాడ కాంతారావు

"పరిసరాలు నచ్చాయా?"

ముక్కుమూసుకుంది సుశీల.

"మెరుస్తున్న మైదానంలా వున్న యిసుక మీదనించి ఆ యెండుచేపల కంపు వచ్చిందా?"

ఈసారి సుశీల చెవులు మూసుకుంది. కొత్త పెళ్ళికూతురు కదా మరి — అంత వేగిరం అభిప్రాయాలిస్తుందా?

"ఎక్కడా చెత్త-ఈ గోల యేమిటి? ఇంత అందమైన ప్రదేశాన్ని మనుషులెంత మురికి కూపం చేశారని విచారిస్తున్నావా?"

సుశీల కళ్ళతో సమాధానం యిచ్చింది.

"అందమైన అతివకు చిరిగిన జాకెట్టు ఇదే బైనా!" అన్నాడు శేష నవ్వుతూ.

బైనా బీచ్ వెంబడి రోడ్డు ఉత్తర దక్షిణ దిశలలో వుంది. ఈ రోడ్డును చేరడానికి వాస్కో నించి తూర్పు పడమరలుగా ఒక రోడ్డు. ఈ రోడ్డుకు ఉత్తరం వేపు వున్న క్వార్టర్సులో మొదటి అంతస్థులో వీరియిల్లు దక్షిణంవేపు బైనా మురికిపేట. వీళ్ళ పడక గది కిటికీ తెరిస్తే యీ మురికిపేట వీళ్ళ కళ్ళెదరగా వుంటుంది. భోజనా లయ్యాక పడక గదిలోకి వచ్చిన శేష దక్షిణం వేపు ఆ కిటికీ తెరిచాడు. వీళ్ళకు బెడ్ లైటు అవసరం లేదు. రోడ్డు దీపాల వెలుగు గదిలోకి



శ్రీ బలివాడ కాంతారావు

వస్తుంది. పైన ఫేను తిరగక్కర్లేదు దక్షిణ గాలి వీస్తుంది. కాని సుశీల ఆ గోల వినలేకపోతోంది

"ఆ కిటికీ వేసేద్దురూ?" అంది చిరాకును అణచుకుంటూ.

"గోల చేస్తే గానీ వాళ్ళకు జరుగుబాటు లేదు" అన్నాడు శేష కానీ కిటికీలు మూయ్యలేదు. వీళ్ళ పెళ్ళి అమర్చిన పెళ్ళి ఈ శేష పెళ్ళి చూపులకు వచ్చిననాడు విసరిన ఒక వాక్యం విన్న దగ్గరనించీ యితన్ని అర్థం చేసుకోవటం అంత సులువుకాదని అనిపించింది. బంధువులంతా "సుశీలకు అందానికి తగ్గ శీలం. శీలానికి తగ్గ మగడు అదృష్టవంతురా" అంటారు. కానీ పైకి కనపడని దురదృష్టం- అదృష్టవంతులోనూ వుంటుందేమో మరి? కాకపోతే శేష ఆ వేళ యేమన్నాడు? అదీ పదుగురి మధ్య.

"మనుషులో యెవరి కుండవలసిన అందం వారి కుంటుంది. కాకపోతే-అది దైవసృష్టి కాదు."

ఇలా ఆలోచించుకుంటే నిద్ర పట్ట లేదు. రాత్రి గడుస్తున్న కొద్దీ గోల తగ్గే బదులు హెచ్చుతుంది. కిటికీ నించి చల్లగాలితో పాటు యీ విజిల్సు యేమిటి. ఈ కఠోర ప్రేమ సంగీతం యేమిటి? చప్పున లేచి కిటికీ దగ్గరకు వెళ్ళింది. రోడ్డుమీద మెర్క్యూరీ లైటు వెలుగులో అంత బాహాటంగా ఆ ప్రేమ కలాపాలేమిటి? అదేమిటా ఆ వాళ్ళ డ్రెస్సులు? గుడలిప్పుకుని యీ గెంతడ మేమిటి? అందులో ఒక అమ్మాయి లైటు క్రిందే నిల్చుంది. ఆమె సరసుడు మంగోలు జాతిమనిషి. ఆమె భుజాల దగ్గరకు వున్నాడు వాడినలా యీడ్చుకుంటూ యెదురుగా నున్న పాకలోకి లాక్కుపోతోంది సుశీల చప్పున కిటికీ తలుపులు మూసి వచ్చి పక్కమీద కూలబడిపోయింది. ఆమె యిరవై యేళ్ళ జీవితంలో యిలాంటివి వినలేదు. కనలేదు.

మూడు రోజుల ప్రయాణ బడలికతో మగడు నిద్రపోతున్నాడు ఈమెకూ ఆ బడలికవున్నా భయంతో కళ్ళుమూతలుపడ లేదు. ఎన్నెన్నో ఆలోచనలు చెమట పట్టింది. లేచి ఫాను వేసింది. కిటికీ మూసినా సముద్రపు హోరు వినిపిస్తోంది. అలవాటులేని హోరు. కన్నవారింట్లో ప్రశాంతస్థలంనించి యీ "యమగోలకి" వచ్చానే అని విసుక్కుంటూ నిద్రపోయింది.

తెల్లవారి లేచేసరికి కిటికీ తలుపులు తెరిచే వున్నాయ్ ఒక్కసారి మనసు చివుక్కుమంది. గబగబ లేచి తలుపులు మూయ్యడానికి వెళ్తుంటే కాఫీ తెచ్చిన శేష—

"కాఫీ తాగు" అన్నాడు.

మౌనంగా కిటికీ తలుపులు మూస్తుంటే "గాలి హాయిగా వీస్తుంది. అవెందుకు మూస్తున్నావ్?"

"అటు ప్రక్క యేం జరుగుతోందో మీకు తెలీదా?"



"ఎవరికి తోచినట్టు వాళ్ళు బ్రతుకుతారు. ఎవరి సుఖం వారిది. అలా చెయ్యొద్దనడానికి నాకేం అధికారం వుంది" అన్నాడు నవ్వుతూ శేషు.

సుశీలకు జవాబివ్వడానికి మాటలు దొరకలేదు. అతను కిటికీ తలుపులు మళ్ళీ తెరవలేదు. ఆఫీసుకు వెళ్ళిపోయాడు. సుశీలకు యేమీ తోచలేదు. ఇంకా యిరుగు పొరుగుతో పరిచయం లేదు. ఒంటరిగా యెంతకని చదువుతుంది? అంగటి బాల్కనీకి వస్తే ఎండ సముద్రంపై పడి అద్దంలా ప్రతిబింబించి తన ముఖంమీదే పడుతోంది వెండిసముద్రంలో అలాంటి రంగు పక్షులు యీదుతున్నాయి. ఇటు వుత్తరానికి వున్న కొండ శిఖార్లలో కొబ్బరితోటలూ, వాటి మధ్య యిల్లూ కనిపిసున్నాయి. దక్షిణంవేపు సముద్రంలో రెండుద్వీపాలు పచ్చగావున్నాయి బీచ్‌లోని మునిసిపల్ పార్కులో చెట్లు సగం చచ్చివున్నాయి. అవన్నీ చూస్తూ మళ్ళీ పడకగదిలోకి వచ్చింది. ఒళ్ళంతా చెమట పట్టింది. కరెంటు లేదు. రాత్రి రెండుసార్లు కరెంటు పోయింది. విధిలేక కిటికీ తెరిచింది. ఎదరగా పాకలోని భామకు అప్పుడే తెల్లవారినట్లుంది. లేచి ఒళ్ళు విరుస్తూ యిటువేపే చూస్తోంది. రాత్రి జాకెటు, మినీతో కనిపించింది. ఇప్పుడు చీరకట్టివుంది. ఎన్ని డ్రెస్సులు ఒక్క రాత్రికి మారిచ్చిందో? ఎందుకలా అదేపనిగా చాపమీద దొర్లుతూ యిటే చూస్తోంది? ఎవరో "మధూ" అని కేకలు వేస్తుంటే లేచింది. గబగబ పళ్ళు తోమి అటువేపు వెళ్ళి టీ కొట్టులో దూరింది. ఏం తిన్నదో యేమిటో కాస్సేపయ్యాక సిగరెట్ కాల్చుకుంటూ ఆ పిల్చిన అమ్మాయితో కలిసి వచ్చింది. తరనాత యింటి గుమ్మం ముందు కూర్చొని గిన్నెలు తోముతోంది. దృష్టి యీ కిటికీ మీదే. నా అందం చూసి ఆనేరం దించేరడంటూ పైట చెంగు వదిలేసింది. త్రోవన పోయే ముసలివాళ్ళు కూడా ఒకసారి ముఖం అటు తిప్పుతున్నారు.

పుష్టిగా బాలింతరాల్లా వుంది. ఎటూ




ఎన్నాళ్ళనుంచో చూస్తున్నాను
ఎదురింటి మేడ మీద
పడమటి వసారాలో
ఆ పడక కుర్చీని—
దుమ్ము- ధూళి-
ఆ వైపు ఎవరూ రారు;
కూర్చోరు—

ఆ గృహ గగనం మీద
హేమంత ప్రదోష వేళ లాగ
ఒంటరితనాన్ని కప్పుకుని కూర్చుంది
బిడ్డను ప్రసవించిన వెంటనే
అక్కళించుకుపోయిన
అమ్మ నిరసపు కడుపులా వుంది
ఎంతో పరిచయం వున్న
'జ్ఞాపకం' లాగ వుంది.
కోడు విరిగిన కవాచి బల్లతో
కష్టం సుఖం చెప్పుకుంటున్నట్టుంది
నిద్ర పట్టని ముసలి కళ్ళతో
ఎవరో అక్కడ అదృశ్యంగా కూర్చుని
వేకువ కోసం
ఎదురు చూస్తున్నారా! అనిపిస్తుంది.
ఆ కుర్చీలో
ఎవరు కూర్చుని వుంటారు?
తల వైపు తిరిగి
నునువు దేరిన మరక
ఎన్ని తరాల, ఏ ఆలోచనలకు
చిహ్నం?

క్రింద నుంచి పిల్లల కేరింతలు
వినిపిస్తూనే వున్నాయి
ఆ పసిపిల్ల లెవరో.
పరుగెత్తుకుంటూ వచ్చి.
చెంగున గెంతి
తన ఒళ్ళో కూర్చోరాదూ!
ఈ చీకటి వైపున ఒక దీపం
వెలిగించరాదూ!— అని
విసుగు లేకుండా
ఎదురు చూస్తున్నట్టే వుంది!!

—ఇంద్రగంటి శ్రీకాంతశర్మ

---

చూడకుండా యీ కిటికీ వేపే యెందుకు చూస్తోంది? అలవాటా అది? అతను గాని అటు వేపే చూసుండేవాడా? అందుకేనా కిటికీని మూస్తే అతని కంత కష్టంగా వుంటోంది? ఇప్పుడు అతను లేడు. నేనున్నానని దానికి తెలిస్తే యిలాంటి పని యిక చెయ్యదని కర్టెను పూర్తిగా లాగింది. ఇద్దరి కళ్లూ భేటీ అయ్యాయి ఒకరి అంగం ఒకరు, ఒకరి కొకరు పోలికలు పట్టుకున్నట్లు చూసుకున్నారు. చప్పున కిటికీ తలుపులు "ధాం" మని సుశీల మూసివేసింది.

అంగటి బీచినించి వస్తున్న యెండు కేవల కంపు. యీ కంపుకన్నా నయం అనుకుని అంగటకు వెళ్తే అదే అటువేపు నించి కూడా కనిపిస్తోంది. ఈ ప్రదేశాని కంతకూ తనే యేలుబడి చేస్తున్నట్టుంది. ఇంట్లోకి పోయి యితని అభిరుచు లెలాంటివో తెలుసుకుందామని పుస్తకాల అలమారులో ఒక్కొక్క పుస్తకం తీస్తూ చివరకు దిగువగా ఒక పుస్తకం తీస్తూ "అమ్మో! ఇదేం పుస్తకం? ఈ బూతు బొమ్మలేమిటి? మెత్తగా కనపడే యితను ..కథానాయకునిలా వున్నాడే? కిటికీ మూయలేదెందుకో యిప్పుడు వూహించ వచ్చు. దక్షిణ గాలి కాదు— ఇలాంటి వేడి గాలి తగలాలని -- అంతే!" అంటూ సాయంత్రం అతను వచ్చేసరికి ఏమీ తెలియనట్లు అంతా సర్దేసింది.

శేషు రాగానే బట్టలు మార్చుకుంటూ కిటికీ తలుపు తెరిచాడు.

"నేను వచ్చినా పాత అలవాట్లు మారవా?" అంది.

"వాళ్ళవేపు చూసి వాళ్ళెలా బ్రతుకుతున్నారో తెలుసుకుంటే తప్పా?"

"దానివల్ల లాభం?"

"ఆడదానిని అర్థంచేసుకునే అదృష్టం కలుగుతుంది."

మరి మాటాడకుండా అక్కడ నించి వెళ్ళిపోయింది వంటయింటికి తరవాత వస్తూ "అలమారులో నీ అభిరుచికి తగ్గవేవైనా దొరికాయా?" అడిగాడు ఆమె ఒక్కసారి నిర్ఘాంతపోయి చూసింది.

"ఎలా వుంది గోవాలో నీ తొలి రోజు?"

"బ్రహ్మాండంగా వుంది"

ఆ రాత్రి మళ్ళీ అదే తంతు. అతను కిటికీ తెరచాడు. ఆమెకు ఆ కిటికీ తెరవటం యిష్టం లేదు. ఈ సారి కిటికీ మూయమని పట్టుబట్టింది

"ఆ గోలకు నేను అలవాటుపడాను. అది లేకపోతే నాకు నిద్రపట్టదు."

"నాకు గోల వుంటే నిద్రపట్టదు"

శేషు గబగబ లేచాడు. యింత దూది తెచ్చి ఆమెకు అందిస్తూ "ఇది చెవిలో పెట్టుకుంటే ఆ గోల వినపడదు" అన్నాడు.

"అది పెటుకున్నా వినిపిసుంది ఆ నరకం కనిపిస్తోంది."

"ఆ కిటికీ నించి చూస్తే నాకు ఆకాశంలో మెరుస్తున్న చుక్కలూ, ఆ చుక్కల వెలుగులో చలించే అలలు, అలలపైనించి విరహ వీణాగతులతో వీచే గాలి! ఇది గోల కాదు- దశదిశలు పయనించే ప్రకృతి నిశ్వాసం. రా చూడు. ఆ చివరి ద్వీపంలో లైటుహౌసు యెలా వెలిగి నౌకలకుకాదు-వాటిని నడిపే మనుషులకు దారి చూపిస్తోందో"

కృష్ణశాస్త్రి కవిత్వంలా వున్న అతని ధోరణి విని ముకసరిగా "కుళ్ళును అసహ్యించుకోకపోతే దానిని వదలించుకోలేం!" అమ్మాయి తెలివిగా ఆలోచించి అన్నది.

"ఈ యింట్లో అసహ్యించుకోవలసింది యేముంది చెప్పు? వదలించుకోవలసింది యేముంది?"

"ఇంటకాదు. బయట."

శేషు నవ్వాడు. ఆ నవ్వులోని భావం ఆమెకు అర్థం కాలేదు అందుకే అన్నాడు.

"నేను సంస్కర్తను కాను కసపం శాసనాలను అమలుపర్చే వాడినైనా కాను. నేనూ వాళ్ళలాంటి మామూళ్ళు మనిషిని. కనీసం ఆమె నవ్విన నవ్వుకు జవాబుగా తిరిగి నవ్వలేనివాడిని. అలాంటివాడిని— వాళ్ళను చూసి అసహ్యించుకుంటే నాకేం వస్తుంది?"

"ఆడదాని శీలం విలువ దానికి తెలీదు. మీకు తెలుసనుకున్నాను."

"మనుషుల నిర్దయతో ఆమె యీ పరిస్థితికి వచ్చింది. కిటికీ తలుపులు మూసి ఆమెను అవమానపరచడం యేం సబబు?"

"ఎవరి సబబు వాళ్ళది."

పరుపుమీద పడూ శేషు అన్నాడు: "ఒక్క రోజులో ఒకరి గురించి అభిప్రాయం యివ్వగలిగే నీ నేర్పుకు జోహారులు."

ఇది ఆమె యెగతాళిగా తీసుకుని మౌనం దాల్చింది. ఎన్నో మార్పులు, ఆశలూ పెట్టుకున్న జీవితం ఒకే విధంగా సాగిపోతోంది ఈ బీచికి ఆనుకుని వున్న మురికి కూపాలు, అక్కడనించి వస్తున్న దుర్గంధం, అందులో నివశించే జీవాలు— ముఖ్యంగా ఆమె కంటికి కనిపిస్తున్న కొందరు ఆడవాళ్ళ బ్రతికే హీనమైన బ్రతుకులూ, అక్కడ చేరివున్న చెత్త, చచ్చిన పందికొక్కులు, వీధికుక్కలూ- ఈ కుళ్ళంతా ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వచ్చి నెల దాటినా యెన్నోనెలలు గడిచినట్లుంది. కొన్నాళ్ళు కన్నవారింటికి పోవాలని మనసు లాగుతోంది.

అలాంటప్పుడు శేషుతో కలిసి ఒక డిన్నరు పార్టీకి వెళ్ళింది. అందులో కొన్ని తెలుగు జంటలూ వున్నయ్. అందులో సీతమ్మగారు గోవాలో పదిహేనేళ్ళనించి స్థిరపడ్డా తెలుగుతనాన్ని భద్రంగా పరిరక్షించుకుంటూ వస్తున్నారు.

"అమ్మాయ్ సుశీలా! ఎలా వుంది యిల్లు?"

"ఇలా? బాగుందిగానీ-అబ్బా కిటికీ తెరవలేం."

"ఆ పడగ్గది కిటికీయేనా!"

"అవును."

"ఆ క్వార్టరు కట్టిన వెంటనే ఆ యింట మా జంట మొదట కాలు పెట్టింది అప్పుడు దక్షిణంవేపు పెద్ద కొబ్బరితోట వుండేది. రాత్రంతా యేం గాలి వీచేదంటావ్? వెన్నెల రాత్రులైతే ఆ కిటికీనించి వెన్నెల మా పరుపుమీదే పడేది. చీకటి రాత్రులు చుక్కలవేపు చూస్తూ నిద్రపోయేవాళ్ళం. ఎన్నిరకాల పక్షుల కిలకిలలు వినిపించేది!"

"ఇప్పుడు కిటికీ తెరవలేమండీ. ఆ కొబ్బరితోట బదులు మురికి పేట."

"ఆగు- వర్షాకాలం వస్తుంది. మేనించి మొదలు అక్టోబరువరకు— చెప్పకా చెయ్యకా అదేం వెర్రి గాలీ వర్షం. కిటికీ తెరిసే ఒట్టు. ఐనా చెట్లు భయంకరంగా అరిచేవి. కెరటాలు గుండెమీదే పడిపోయేవి. ఇప్పుడు మనిషి మాటలు వినిపిస్తున్నాయ్. ఇది నయం కదా! అడవి కన్నా మనిషితావు గొప్పదికాదా?"

"ఇదీ అలావిలా వుందండీ- భయం వేస్తోంది."

అంతలో అలా వస్తున్న శేషుతో:

"ఏమయ్యా శేషూ! అమ్మాయి కొత్తగా వచ్చిందట భయపడ్తోందికదా. లాలించి చేరదీసుకోవడం యెప్పుడు నేర్చుకుంటావ్?"

"మా ఆవిడను అంత శంకను చేశారేం?"

"నచ్చచెప్పి నీ వేపు లాగుకోవాలిగాని"

"ఎవరికున్న అభిప్రాయాలు వాళ్ళ అనుభవంతో మార్చుకుంటేనే థ్రిల్లింగ్‌గా వుంటుంది కదండీ!"

"శేషు పెళ్లయినా మారలేద"న్న ఆమె అభిప్రాయంతో మిగతా ఆడవాళ్ళు అంగీకరించారు.

ఇక వీళ్ళకు అన్ని అలవాటులానే ఈ అలవాటూ అబ్బింది. అతను ఆఫీసుకు వెళ్ళగానే ఆమె కిటికీ మూసుకోవడం, అతను ఆఫీసునుంచి రాగానే కిటికీ తెరవటం. ఇద్దరూ కలిసి కిటికీ ముయ్యడమో తెరవడమో చెయ్యకపోవటం వలన వీళ్ళ సంసార జీవితంకూడా అలాగే సాగుతోంది.

శివరాత్రి దాటినా యింకా ఉదయం చిన్న చలివేస్తోంది. తూరుపు ఆకాశంలో మేఘాల చాటున ఉదయించిన సూర్యబింబాన్ని స్పష్టంగా చూడవచ్చు. సాయంత్రం పడమటి దిక్కున మేఘాలు జెట్ వదిలేటట్లు తెలుపుపొగనేకాదు రంగు రంగు పొగలను వదలుతున్నాయ్. నిజంగా పొరుగున కొత్తగా దిగిన యిలాలు యిందుమతి ఆ జెట్ విమానంలానే కదులుతోంది. ఇందుమతి కన్నవారిది ఇండోర్. అతనారిది భోపాలట. ఆవిడ నిన్ననేవచ్చి యీవేళ సుశీల యింటోకి నేరుగా "భాభీ" అని వరసపెట్టి మరీ వచ్చింది. అప్పుడే శేషు భయ్యాతో మాట్లాడేస్తోంది. ఒక్క రోజులోనే సుశీల ఈవిడతో మంచి పొత్తు కుదుర్చుకుంది. కారణం చెప్పక్కర్లేదు. ఇద్దరి భావాలు యేకమయ్యాయి.

"ఏం భాభీ! ఇంకేం లేదా?" అంటూ నవ్విన సుశీలతో "నవ్వక. నేను యిలా వచ్చాను అలా మా పెద్దవాడు వస్తున్నా నర్రో అని అరిచాడు."

ఆరుగురు పిల్లలూ యిలా అరిచే వచ్చారట. "అసలు నా అందం చూసి మా ఆయన నన్ను చేసుకుంటానంటే మామగారు మా యింటి సంప్రదాయం చూసి ఈ సమ్మంధానికి ఒప్పుకున్నారు. ఇక మా అత్తగారి సంగతి నీకు తెలీదు. ఆవిడ తండ్రిగారి దగ్గర సాముద్రికం నేర్చుకుందట. నా చెయ్యి చూసి. నాచేత నడిపించి మాట్లాడించికూడా యింకా మనసివ్వలేదు. చివరకు యిదిగో- ఈ ముక్కు చివర పుట్టుమచ్చ చూసి నేను

దీపావళి శుభాకాంక్షలతో

షా అమీచంద్
తారాచంద్
అండ్ కం.,

పోస్టు బాక్సు నెం 120,

నందిపాటివారి వీధి,

విజయవాడ-520 001.

ఫోన్ నెం : 73456

హోల్ సేలర్లు :

బళ్ళార్‌పూర్ ఇండస్ట్రీస్
లిమిటెడ్. (పేపర్)




కోరుకున్నంతా వస్తుందని కోడలుగా చేసుకుంది."

ఇదంతా వింటున్న శేషు-

"మరి ముక్కు-చివర మచ్చలేని వారిగతో? అందం సంప్రదాయం లేని ఆడ వాళ్ళ విషయం అడగవలసింది."

ఈ వేళాకోళం సుశీలకు నచ్చలేదు. ఇక వారం రోజులు కాలేదుగానీ యిందుమతికి సుశీల బాధ యేమిటో తెలిసిపోయింది. ఈబాధలు అమె పంచుకోవటం వలన ఆమె ఉల్లిపాయలూ, బంగాళాదుంపలు, కందిపప్పు, ఆవాలు, కొత్తిమిరి అప్పుని అడిగి తిరిగి యివ్వకపోయినా సుశీల పటించుకోవటం లేదు.

"ఇది చిన్న విషయం. ఇక్కడ ఓడరేవుంది కదా! ఆ నానాజాతివాళ్ళు సముద్రంలో చలిలో చిక్కుకుని ఓడ దిగగానే వెచ్చదనం కోసం యిలా పరుగెత్తి వచ్చేస్తారు. ఈ రెడ్‌లైట్ యేరియాని సంసారుల యింటిపక్క వుంచడం యేం బాగలేదు. ఈ మధ్య పేపరో చూడలేదా? గవర్నరు గిల్‌గారేమన్నారు? ఈ హిప్పిలను తగిలేయాలన్నారు. అలాంటి ధర్మప్రభుపు వీళ్ళనె తగిలీలేరా? ఇది అతని దృష్టికి యెవరూ తేనేలేదు అతని సెక్రటరీతో మీభయ్యాకు పరిచయం వుంది. నేను వీళ్ళను యిక్కడనించి పంపించే యేర్పాటు చెయ్యిస్తాను."

ఆ యేర్పాటుకు యిది లంచం అన్నట్లు సుశీల మసాలా దోసెలు తినిపించి మాంచి పిలరుకాఫీ యివ్వగానే ఆమె పరిపూర్ణానందంతో "ఈ దోసెలు మీ భయ్యాకిష్టం ఇంకెప్పుడైనా చేస్తే రెండు పంపించడం మరిచిపోకేం భాభీ" అంది. "ఇప్పుడే యిస్తాను. తీసుకెళ్ళండి" అని సుశీల కాస నెయ్యి పోసికాల్చి మరీ యిచ్చింది.

సుశీలకు యీ కుటుంబం పొరుగున వుండటం కాస్త వుబుసుపోతోంది. ఒంటరితనం పీలవడం లేదు. ఎక్కడాలేని వార్తలన్నీ యిందుమతి తెస్తుంది. అంచేత కన్నవారింటికి వెళ్ళిపోవాలన్న ధ్యాస తగ్గింది. ఆ నెలలోనే ఒక రోజు చీకటి పడ్డాక శేషు యింటికివచ్చి, అలవాటుకొద్దీ పడకగది కిటికీ తెరిచి గాలి పీల్చుదామని వెళ్ళాడు. ఆ వేళ కిటికీ తెరిచే వుంది.

"ఈ వేళ కిటికీ మూయటం మరచావు!"

"పొరుగు భాభీ ధర్మమంటూ- ఇంక మూయ్యఖరేదు"

"ఆవిడేం చేసింది?"

"అతగానితో చెప్పి"

"చెప్పి?"

"అతను గవర్నరుగారి శెక్రటరీతో చెప్పి."

"ఏం చెయ్యించాడు?"

"శక్రటరీగారు గవర్నరుగారితో విన్నవించి పోలీసులను పంపించి వాళ్ళందరిని అరెస్టు చెయ్యించి తీసుకపోయారు."

"ఆవిడ అలా అని చెప్పిందా?"

"చెప్పింది. చెప్పకపోయినా కనిపిస్తోందిగా! కావలిసే చూడండి. ఆ పాడు ముఖాలొక్కటి కనిపించవు. హమ్మయ్యా! వచ్చినయిన్నాళ్ళకు హాయి అనిపిస్తోంది."

"నిజమే మరి! మేం యెవ్వరం చెయ్యించలేని ఘనకార్యం మీ భాభీ చెయ్యించగలిగింది."

అడక్కుండానే వడించింది. కూరలో కొత్తరుచి వచ్చింది. భోజనం దగ్గర శేషు అమాయకంగా అడిగాడు- "ఈ పని చెయ్యించడానికి ఆవిడకు యెన్ని కేజీల ఉల్లి, బంగాళాదుంపలు లంచం యిచ్చావు?"

"మీకు అంత వేళాకోళంగా వుందేం? మీకేం తెలుసు నా బాధ? తెలుసుకోడానికైనా ప్రయత్నించారా? కొత్తగా, ఒంటరిగా యిల్లాలొస్తుందే-ఇలాంటి నరకంలో వెయ్యకూడదని ఒక్కసారైనా నన్ను తోడుకొచ్చేముందు ఆలోచించారా? మీకేం రోజంతా ఆఫీసులో వుంటారు. ఇంట్లో వున్నదాన్ని నేనొక్కర్తెను. ఏ వెధవ రాయి విసిరేస్తేనో ఏ గుండ బలవంతాన నన్ను లాక్కుపోయి ఆ మృగాల ముందు బలిచేస్తే..." అంతకోపంతో వెంటనే వెక్కి వెక్కి యేడ్చేస్తోంది. శేషు జవాబు చెప్పలేదు

మరునటిరోజు ఆఫీసునుంచి వచ్చేసరికి మళ్ళీ కిటికీ మూసే వుంది.

"ఏం కిటికీ మూసేశావు?"

తలదించుకుని "వాళ్ళంతా మళ్ళీ వచ్చేశారు."

"మరి యిందు భాభీ యేం చేస్తోంది?"

"పోలీసులమీద గవర్నరుగారితో ఫిర్యాదు చేయిస్తుందట"

# కిటికీలో కొండ

కొండ అద్దమందు కొంచెమై
వుంటుంది
కిటికీ కంట్లో మాత్రం ఘనంగానే
నిల్చుంటుంది.
అప్పుడప్పుడూ కొండ ఆకుపచ్చగా
కనిపించినా
మళ్ళీ మామూలు కొండగా మారి
పోతూంటుంది
రెప్ప మూయకుండా ఈ కిటికీ
ఎప్పటికీ
ఈ కొండనిలా చూసినా యేమీ అర్థం
కాదు!
వీధిలో చీకటితో పోరాడే ఆ చిన్న
దీపం
కిటికీ ఇనుప కంట్లో వెలుతురు
రక్తనాళాల్ని అల్లుతూంది!
గోరంత దీపం కొండలకు వెలుగు!

—పి. రామకృష్ణారెడ్డి

"ఇంత చదివించి నిన్ను ఆలోచించ నివ్వకుండా యిన్నాళ్ళు పెంచిన వాళ్ళ ననాలి-నిన్నని యేం లాభం?"

"మీకేమైనా అనాలని వుంటే నన్ను అనండి. మా వాళ్ళను అంటే నేను ఒప్పుకోను" సుశీల బిరుసుగా అంది. శేషు పక్కన నవ్వి కిటికీ తలుపు తెరచాడు.

"రా .... ఇద్దరం చూద్దాం. చూడు ఆ అమ్మాయి మధు ...టే చూస్తోంది. ఇద్దరం నిల్చుంటే మరీ ముచ్చటగా చూసుంది. చూశావా? నిన్ను సృష్టించిన దేముడే ఆ అమ్మాయినీ సృష్టించాడు. నీ తెలుపుఛాయ లేకపోవచ్చు. నీ కన్న పొడగరి. బంతిలా వుంది. ఆ నుదురు యెంత విశాలంగా వుందో! ఆ చేతులు యెంత మృదువుగా వున్నాయో- అంత బలంగానూ వున్నాయి. పాపం! ఈ పరిస్థితి కెలా వచ్చిందో?"

"ఎలా వచ్చింది? కావ్వి పోయి వచ్చింది!"

"అలా వచ్చిందో- ఎ మగాళ్ళు మోసం చేస్తే యీ గతి పట్టిందో?"

"శీలం మీద గౌరవం వున్న ఆడది పాచిపనైనా చేసి బతుకుతుంది. అది చాత కాకపోతే అడుక్కుని తినైనా బ్రతుకుతుంది."

"ఆమె శీలం మీదనాకు గౌరవం. కాకపోతే యెన్ని సార్లు కిటికీ దగ్గర నిల్చున్నా నన్ను రమ్మని సైగ చెయ్యలేదు."

"పిల్చుంటే పోయేవారా?"

"ఏమో? అప్పుడు యింత అందమైన పెళ్ళాం వస్తుందని కలలు గన్నానా?"

ఆమె వింతగా భర్తవేపు చూసింది. ఈయన గోవాలో గౌరవమైన అలవాటును అలవర్చుకున్నారా? దగ్గరగా వచ్చింది. ఏవాసనా లేదు. తాగని మనిషి యిలాంటి కబుర్లెలా చెప్పగలుగుతున్నారని. ఆ యెరుపు కళ్ళు చూసి ఒంటి మీద చెయ్యి వేసింది. ఒళ్ళు కాలిపోతోంది ... జ్వరం తగ్గడం, మళ్ళీ రావడం, హెచ్చవడం – వారం రోజుల్లో ఆసుపత్రిలో చేర్చవలసి వచ్చింది. ఒంటరిది. ప్రక్కన భాషీద మాటధైర్యమేగానీ చేత ధైర్యం కాదు చివరకు తండ్రికి టెలిగ్రాం పంపింది. వాళ్ళు వచ్చేసరికి మూడు నాలుగు రోజులు పట్టాయి. శేషు మిత్రులు ఆసుపత్రిలో పడుకుంటున్నారు.

ఆ రోజు చీకటిపడే వరకు ఆసుపత్రిలోనే వుంది. శేషు కొద్దిగా కోలుకున్నాడు. మెల్లగా మాట్లాడుతున్నాడు. అతని కళ్ళల్లో యిదివరకు ఆమె చూడని ఆర్ద్రత కనిపిస్తోంది. పోరు ఆసుపత్రి కదా-రోడ్డు మీద దీపాలుంటాయ్, ఎవరో కదులుతుంటారు భయం లేదు. అందుకే గోవాలో ఒంటరిగాఆడవాళ్ళు కదలినా భయం లేదు. ఆసుపత్రి బయటకు వచ్చి యింటి వేపు వెళుంటే అప్పుడే మేఘాలు ఆకాశమంతా అలముకుని వున్నాయ్. ఆ రోడు సగానికి వచ్చేసరికి వర్షం దబదబముంచుకొచ్చింది. అక్కడెక్కడో ఆగితే చప్పునదీపాలు ఆరిపోతే ఒంటరి దైపోతుంది వర్షంలో తడుస్తున్నా గబగబ నడిచి రోడ్డుమలుపు తిరిగింది. ఈ రోడ్డు చివర్లోనే తన యింటి చుట్టూ ఉన్న ప్రహరీగేటు, రోడ్డుమీద ఒక కుక్క, పిల్లి, మనిషి కనపడలేదు. ఉరుములు, మెరుపులతో వర్షం బాదుతోంది. తలుపులు వేసుకుని వున్నారు. ఆ లైటు రోడ్డుమీది ట్యూబులైటు. ఆ లైటు క్రింద యిదరు తడుస్తున్నారు. వాడు పరాయి దేశస్థుడు. వర్షంఅంటే అపురూపమైన దేశం నించి వచ్చాడు వరం తెచ్చిన చల్లదనంలో వాడికి వెచ్చదనం కావాలి. అందుకే ఆ పాకనుంచి మధును వర్షంలోకి యీడ్చుకొచ్చాడు నిర్మానుష్యమైన ఆ రోడ్డు వాడికి




పడకగదై పోయింది. మధును నొక్కుతూ గెంతుతున్నవాడు ఒక్కసారి యెలా క్రీగంటతో చూశాడో పొంచి వున్న పులిలా ఒక్క గెంతు గెంతి సుశీల నడుం పట్టుకున్నాడు. ఆమె వేసిన కేక ఆ వర్షపు హోరులో వినిపించలేదు. మధు సుశీలను పోల్చుకుంది. ఒక్కసారి ఆవేశంతో వాడిపై వురికి వాడిని పళ్ళతో అదేపనిగా కరుస్తూంటే వాడు కేకలు వేస్తూ సుశీలను విడిచిపెట్టేశాడు "పరుగెత్తమ్మా" అని హిందీలో కేకలు వేసింది. ఇంటికో యెలా వచ్చి పడిందో సుశీలకే తెలీదు. తెలివి వచ్చే సరికి ఒళ్ళంతా చెమట పట్టి వుంది. మెల్లగా లేచి, వున్న పాలన్నీ గడగడ తాగేసింది. అప్పుడు కొస్త వూపిరి సరిగా సలిపింది. కాస్త శక్తి వచ్చాక తల స్నానం చేసింది.

భర్త యింటికి వచ్చేసరికి వారం రోజులైంది అతను వచ్చేసరికి కిటికీ తలుపులు తెరిచే వున్నాయ్. మళ్ళీ పోలీసులు వాళ్ళను లాక్కుపోయారేమో నని కిటికీ నుంచి చూశాడు ఎదురుగా మధు కనిపించింది నీలి మేక్సీతో! భార్యవేపు చూశాడు. ఆమె తనకోసం యీ మధ్య పడ్డ శమ జ్ఞప్తికి వచ్చింది. పరుపుమీద జారబడుతూ "ఫరవాలేదు. ఆ కిటికీ తలుపులు మూసెయ్" అన్నాడు.

ఆమె మూయ్యలేదు. అతను లేచి మూసుందే దగ్గరగా వెళ్ళి ఆపి అతని కళ్ళల్లోకి చూసింది ఆమె కళ్ళల్లో నీరు పేరుకుపోయూ... . ఆహ్లాదానిచ్చే దక్షిణపు గాలి ఒక్కసారి వీచింది.